బాధితులకు అండగా ఉంటా

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

అగ్ని ప్రమాద బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్, డిసెంబర్ 22: అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధితులకు అండగా ఉంటానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఇటీవల మోండా మార్కెట్‌లో ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో ఐదు షాపులు దగ్ధమైన సంగతి తెలిసిందే. ప్రమాద సమయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తిరుమల తిరుపతి వెంకన్న దర్శనానికి వెళ్లారు. దీంతో ప్రమాద స్థలికి వెళ్లలేక పోయారు. కాగా బాధితులు ఆదివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా బాధితులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఘటన చాలా బాధకమని విచారం వ్యక్తం చేశారు. అన్ని విధాలుగా ఉండగా ఉంటానని హామీ ఇచ్చారు. సోమవారం అధికారులతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలిస్తామని చెప్పారు. బాధితులతో పాటు బీఆర్ఎస్ నాయకులు ఆకుల హరికృష్ణ, తలసాని స్కైలాబ్‌యాదవ్, మహేందర్, మధు, మహేశ్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

పీవీ రావు త్యాగాలు వెలకట్టలేనివి

అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చెన్నయ్య తదితరులు

ఖైరతాబాద్, డిసెంబర్ 22 : మాల మహానాడు వ్యవస్థాపకులు పీవీ రావు బడుగు, బలహీనవర్గాల కోసం చేసిన త్యాగాలు వెలకట్టలేనివని ఆ సంఘం జాతీయ అధ్యక్షులు జి. చెన్నయ్య అన్నారు. పీవీ రావు, దివంగత బడుగుల నేత జి.వెంకటస్వామి వర్ధంతి సభ ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లోని అంబేద్కర్ స్ఫూర్తి భవన్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన చెన్నయ్య మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత స్ఫూర్తిని ముందు తరాల వారికి అందించేందుకు దివంగత నేతలు ఎనలేని కృషి చేశారన్నారు. వారి కృషి ఫలితంగానే రాజ్యాంగ ఫలాలు దళితులకు దక్కుతున్నాయన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎర్రగడ్డలో..

ఎర్రగడ్డ: అంబేద్కర్ విగ్రహ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావు వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. మోతీనగర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు పీవీ రావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విగ్రహ పరిరక్షణ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదగిరి, బోరబండ డివిజన్ అధ్యక్షుడు బొట్టుశివ, దశరథం, తిరుపతి, సంపత్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కమిటీలు ఏర్పాటు చేయాలి

హిమాయత్‌నగర్, డిసెంబర్ 22: తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పేరెంట్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని పేరెంట్స్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మహబూబ్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర విజ్ఞప్తి చేశారు. ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

బ్యాడ్మింటన్‌లో రైల్వే జట్టు విజేత

బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతగా నిలిచిన రైల్వే జట్టు

బొల్లారం, డిసెంబర్ 22: బొల్లారం కంటోన్మెంట్ పబ్లిక్ గార్డెన్‌లో ఆదివారం బొల్లారం బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ ఆధ్వర్యంలో అర్జుమన్ రావు జ్ఞాపకార్థంగా బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించారు. పోటీల్లో 12 జట్లు పాల్గొనగా రైల్వే జట్టు విజేతగా నిలిచింది. కార్యక్రమంలో అధ్యక్షుడు జైహింద్‌రెడ్డి, వైస్‌ప్రెసిడెంట్ ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి ఎంబీ అనంత్ నారాయణ్, జాయింట్ సెక్రటరీ సుశీల్ కుమారక్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్వీ రమేశ్‌కుమార్, కోశాధికారి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సనాతన అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

సనాతన అసోసియేషన్ వ్యవస్థాపక వేడుకల్లో డైరీ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

అమీర్‌పేట్ డిసెంబర్ 22: సనాతన ఎంటర్ ప్రెన్యూర్స్ అసోసియేషన్ 7వ వ్యవస్థాపక వేడుకలు పురస్కరించుకొని నిర్వహించిన యువజన సదస్సులో భాగంగా సంస్థ డైరీ ఆవిష్కరణ అమీర్‌పేట్‌లో ఆదివారం జరిగింది. అసోసియేషన్ చైర్మన్ నరేంద్రకుమార్ కామరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వేణుగోపాలరావు, మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలచారి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు సత్యం శ్రీరంగం, వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్బీ రాం పాల్గొన్నారు. ముఖ్యఅతిథి వేణుగోపాల రావు మాట్లాడుతూ బ్రాహ్మణులు అన్నిరంగాల్లో రాణించేందుకు ఐక్యంగా ముందుకు కదలాలని అన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

బొల్లారం, డిసెంబర్ 22: బొల్లారం హోలీ ట్రినిటీ చర్చిలో ఆదివారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, యువత క్రిస్మస్ నాటికలు, నృత్యాలతో అలరించారు. అనంతరం ప్రెస్బిటర్ ఇన్‌చార్జి చార్లెస్ వెస్లీ, కమిటీ సభ్యులతో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్బిటర్ కార్యదర్శి సుందర్‌రావు, గాబ్రీయేలు, చంద్రలీల దానియేలు తదితరులు పాల్గొన్నారు.

గెజిటెడ్ అధికారుల సంఘం ఎగ్జిక్యూటివ్ బాడీ ఉపాధ్యక్షుడిగా ప్రొ.గడ్డం మల్లేశం

తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఎగ్జిక్యూటివ్ బాడీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ప్రొఫెసర్ గడ్డం మల్లేశం, అధికారులు, ప్రొఫెసర్ మల్లేశం (అంతర్ చిత్రం)

సికింద్రాబాద్, డిసెంబర్ 22: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ బాడీ ఉపాధ్యక్షుడిగా ప్రొఫెసర్ గడ్డం మల్లేశం ఎన్నికయ్యారు. తెలంగాణ విశ్వవిద్యాలయాల్లోని బోధనా, బోధనేతర సిబ్బంది సమస్యలపై సుదీర్ఘంగా పోరాడుతున్న ఓయూ టీచర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రాష్ట్ర ఆల్ వర్సిటీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూడా ఉన్న ఆయన జీవితాంతం విద్యార్థుల, ఉద్యోగుల సమస్యలపై అనేక పోరాటాలు చేశారని పలువురు వక్తలు పేర్కొన్నారు. విద్యార్థి నాయకుడిగా, ఉద్యోగ సంఘాల నేతగా ఆయన ఎప్పుడూ సమస్యల్ని పరిష్కరించేందుకు తన దైన శైలిలో పని చేశారని అన్నారు. వర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక నియామకాల భర్తీ కోసం సత్వర చర్యలకు ప్రభుత్వాన్ని ఒప్పిస్తామని, అలాగే సిబ్బంది వయో పరిమిత 65 ఏండ్లకు పెంపు, ఆరోగ్య కార్డులు, పెన్షన్ అమలుతో పాటు, విద్యాలయాల్లో సమస్యల పరిస్కారం కోసం పని చేస్తానని ప్రొఫెసర్ జి.మల్లేశం పేర్కొన్నారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ సత్యనారాయణకు, బి.శ్యామ్, అసోసియేట్ ప్రెసిడెంట్లకు కృతజ్ఞతలు తెలిపారు. విశ్వవిద్యాలయ బోధనా సిబ్బంది అసోసియేషన్స్‌లో పనిచేసిన అనుభవంతో ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. తన బాధ్యతను మరింత పెంచిందని ఆచార్య మల్లేశం ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. నూతన బాధ్యతల్లో విజయవంతం కావాలని ఓయూ బోధనా సిబ్బంది అభినందనలు తెలిపారు.

అయ్యప్ప స్వామి మహా పడిపూజ

బొల్లారం, డిసెంబర్ 22: కంటోన్మెంట్ బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు ఆవరణలో ఆదివారం అయ్యప్ప స్వామి మహాపడి పూజ అంగరంగ వైభవంగా జరిగింది. పూజల అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు కమిషన్ ఏజెంట్లు, హమాలీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నగరంలో రోజురోజుకు నిరాశ్రయుల సంఖ్య పెరుగుతోందని స్కై ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సంజీవకుమార్ అన్నారు. ఆదివారం నిరాశ్రయులకు, ఆకలితో అలమటిస్తున్న అన్నార్థులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. 267 మందికి అన్నదానం చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు పావని, నేహా అప్సారి, అఖిల్ పాల్గొన్నారు. – బన్సీలాల్‌పేట్

ఆర్యవైశ్య సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

అడ్డగుట్టలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వైశ్య సంఘం సభ్యులు

అడ్డగుట్ట, డిసెంబర్ 22: ఆర్యవైశ్య సంఘం తుకారాంగేట్ ఆధ్వర్యంలో అడ్డగుట్ట శాస్త్రినగర్‌లోని సంఘం కార్యాలయంలో 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. సంఘం సభ్యులు సంఘటితంగా పనిచేయాలని, సీతాఫల్‌మండిలో కన్యాక పరమేశ్వరి అమ్మవారి ఆలయాన్ని నిర్మించేందుకు ఐక్యంగా ముందుకు సాగాలని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ప్రభుగుప్తా, నాగబండి శ్రీకాంత్, మల్లవోలు శ్రీకాంత్, నాగబండి శ్రీనివాస్, తల్లెం వెంకటేశ్, శ్రీనివాస్, సంఘం వైస్‌చైర్మన్ కందుకూరి సాగర్ బాబు, నర్సింగారావు, శ్రీధర్, లక్ష్మనఖ, గణేశ్‌రావు, అశోక్, శ్రీనివాస్, మహేశ్, జగదీష్, గౌతమ్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

అసమానతలను రూపుమాపాలి

హిమాయత్‌నగర్, డిసెంబర్ 22: సమాజంలో నెలకొన్న అసమానతలను రూపుమాపేందుకు ప్రజల పక్షాన నిలబడి సీపీఐ నిరంతరం పోరాటాలు చేస్తుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సీపీఐ శత వసంతాల సందర్భంగా ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో తెలంగాణ ప్రజా నాట్యమండలి, అభ్యుదయ రచయితల సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి వర్క్‌షాపు జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా,తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాలలో సీపీఐ కీలకపాత్ర పోషించిందని తెలిపారు.ఈ నెల 30న నల్గొండ జిల్లా కేంద్రంలో జరిగే సీపీఐ శత వసంతాల సంబరాల సభకు ప్రజలు అధిక సం ఖ్యల్లో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

ఉద్యమ కళాకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



కార్యక్రమంలో చైర్మన్ సుల్తాన్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి ప్రపుల్ రాంరెడ్డి, ఉద్యమకారులు, కళాకారులు

చిక్కడపల్లి, డిసెంబర్ 22: కళాకారులకు, ఉద్యమకారులకు ఇచ్చిన ఎన్నికల హామీలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి ప్రపుల్ రాంరెడ్డి డిమాండ్ చేశారు. టీయూజేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం బాగ్‌లింగంపల్లి ఓంకార్ భవన్‌లో కళాకారుల హక్కుల సాధనకై ఆట పాట నిర్వహించారు. చైర్మన్, ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కళాకారులది కీలకమైన పాత్ర అని అన్నారు. కళాకారులను అన్ని విధాలుగా ఆదుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అదే విధంగా ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం హామీ అమలు చేయాలేదని అన్నారు. అంతే గాకుండా 30వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా తరలివచ్చిన కళాకారుల ఆట పాటల ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కోశాధికారి చంద్రశేఖర్, గంటి చంద్రుడు, షేఖ్ షావలి, మోహన్ బైరాగి, కృష్ణసాగర్ అయ్యవారి యాదగిరి, హన్మంత్‌రావు, ఇంద్ర, గంగి రాజు, వివిధ జిల్లాల నుంచి కళాకారులు, ఉద్యమకారులు భారీగా హాజరయ్యారు.

రైల్వే ట్రాక్‌పై వ్యక్తి ఆత్మహత్య

మారేడ్‌పల్లి, డిసెంబర్ 22: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి జీవితంపై విరక్తి చెంది రైలు పట్టాలపై ఆత్మహత్య చేసుకున్న సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు మండలం, గొలనుకొండకు చెందిన దూడల వెంకటేశ్ (45) కొన్నేండ్ల క్రితం జీవనోపాధి నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి లాలాపేటలో ఉంటూ డీటీపీ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. కాగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. జీవితంపై విరక్తి చెందిన ఆయన శనివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి లాలాపేటలోని విజయ డైరీ సమీపంలో రైలుకు ఎదురుగా వెళ్లి ట్రాక్‌పై ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చూరీకి తరలించారు. మృతుడి మొదటి భార్య చనిపోవడంతో రెండో పెళ్లి చేసుకున్నాడు. మొదటి భార్యకు ఇద్దరు కుమార్తెలు కాగా, రెండో భార్యకు ఒక కుమారుడు ఉన్నాడు. ఆదివారం పోస్టుమార్టం నిర్వహించిన పోలీసులు కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబర్ 22 : కూకట్‌పల్లి రైతుబజార్‌లో ఆదివారం కూరగాయల ధరలు కింది విధంగా ఉన్నాయి.(కేజీ–రూపాయలలో)
టమాట 15, వంకాయ 35, బెండకాయ 45, పచ్చిమిర్చి 33, బజ్జి మిర్చి 22, కాకరకాయ 35, బీరకాయ 55, క్యాబేజి 18, ఫ్రెంచ్ బీన్స్ 50, క్యారెట్ 28, కాలీఫ్లవర్ 25, దొండ 45, చిక్కుడు 45, గోరుచిక్కుడు 28, బీట్‌రూట్ 43, క్యాప్సికం 50, ఆలుగడ్డ 25, కీరా 23, దోసకాయ 20, సొరకాయ 20, పొట్లకాయ (1) 22, కందగడ్డ 55, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 40, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 37, ముళ్లంగి(1) 4 నుంచి 5, మొరంగడ్డ 35, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు(12) 30 నుంచి 40, మునగకాయ(1) 18 నుంచి 20, పచ్చి బఠాని 75, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200 గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 100, వెల్లుల్లి 360, చింతపండు 140, కరివేపాకు 100 ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9:30 గంటల వరకు అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

దీప్‌శిఖా మహిళా క్లబ్ వజ్రోత్సవ వేడుకలు ఆదివారం బేగంపేట్ మలానీ హౌజ్‌లో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దశాబ్దాలుగా వారు చేస్తున్న సేవలను గుర్తు చేసుకున్నారు. క్లబ్ అధ్యక్షురాలు రాధిక మలానీ మట్లాడుతూ వెనకబడిన మహిళలకు మద్దతు అందించడంతో పాటు పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు క్లబ్ కృషి చేస్తున్న విషయాన్ని వివరించారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను అమితంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, క్లబ్ సభ్యులు సునితా గగ్గర్, ప్రియాంక బహేటి, సంగీతజైన్, భావనసంఘీ తదితరులు పాల్గొన్నారు. – బేగంపేట్, డిసెంబర్ 22:

కేంద్ర మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

సమావేశంలో మాట్లాడుతున్న బాలనరసింహ

రేపు నగరంలో భారీ ధర్నా

ఖైరతాబాద్, డిసెంబర్ 22 : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా బేషరతుగా క్షమాపణ చెప్పాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ ఫలాలతో నేడు పార్లమెంట్‌లో పదువులు అనుభవిస్తున్నారని, ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేయడం విచారకరమన్నారు. గతంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం అంబేద్కర్‌ను కించపరిచిందని, చరిత్ర పుటల్లో ఆయన చరిత్ర లేకుండా చేయాలని కుట్ర జేసిందన్నారు. అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ ఈ నెల 24న నగరంలో భారీ ధర్నా చేపట్టనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ బి. ఈశ్వర్, బడంగ్‌పేట డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రను వక్రీకరించేందుకు కేంద్రం కుట్ర

హిమాయత్‌నగర్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చరిత్రను వక్రీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల నరసింహ ఆరోపించారు.ఆదివారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధి కారంలోకి వచ్చిన నాటి నుంచి మను ధర్మశాస్త్ర విధానాలను అమలు చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. 2025 జనవరి 5నుంచి 7 వరకు ఖైరతాబాద్‌లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో జరిగే ఏఐడీఆర్ఎం 2వ జాతీయ మహాసభలకు దళితులు అధిక సంఖ్యల్లో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.ఈ సమావేశంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కె.యేసురత్నం,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్,రాష్ట్ర నేతలు ఆరుట్ల రాజ్ కుమార్, కుమార్,టి.రామకృష్ణ,వెంకటస్వామి,లక్ష్మీపతి,రాజరత్నం పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను 'బీసీ-ఏ' లోకి మార్చాలి

సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయవాది చిల్లా రమేశ్

చిక్కడపల్లి, డిసెంబర్ 22: ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్‌లను బీసీ–ఏ జాబితాలోకి మారుస్తామని ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్‌లను ఆ జాబితాలో మర్చే ప్రక్రియ చేపట్టాలని ముదిరాజ్ సంక్షేమ సమితి నాయకులు డిమాండ్ చేశారు. సమితి రాష్ట్ర అధ్యక్షుడు అల్లదుర్గ సురేశ్ ముదిరాజ్ అధ్యక్షతన ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సమావేశం నిర్వహించారు. హైకోర్టు న్యాయవాది చిల్లా రమేశ్‌ముదిరాజ్, సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలుగారి నర్సింహ మాట్లాడారు. 2009లో అప్పటి సీఎం వైఎస్ఆర్ జీవో ఎం.ఎస్ 15/2009 ద్వారా బీసీ–ఏ లోకి ముదిరాజులను మార్చినప్పటికీ అమలు చేయడంలో నిరక్ష్యం వహించారని విమర్శించారు. ముదిరాజ్‌లకు మంత్రి పదవి ఇస్తానని ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించినప్పటికీ నేటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం దారుణం అన్నారు. ఈ సమావేశంలో ముదిరాజ్ సంక్షేమ సమితి రాష్ట్ర కార్యదర్శి గోనెల కుమార్, ఉపాధ్యక్షుడు తోట సంజయ్, నాయకులు బి.నారాయణ, కటికల శ్రీహరి, మురళీమనోహర్, వోన్నాపేట రమేశ్, సినేటి శ్రీనివాస్, బాబురావు, చొప్పరిరాము, రాజేశ్వరి, అనసూయ, విజయలక్ష్మి, మధు, అనిల్‌కుమార్, నర్సయ్య, శ్రీను, బోయిని శివ, జాన్, నరేశ్, శైలేందర రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా గుర్తించాలి

సభలో మాట్లాడుతున్న సేవాలాల్ బంజారా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కోర్ర మోతిలాల్ నాయక్

చిక్కడపల్లి, డిసెంబర్ 22: గిరిజన తండాలను, గూడేలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా గుర్తించి, ప్రతి పంచాయతీకి 5 కోట్ల నిధులు మంజూరు చేయాలని సేవాలాల్ బంజారా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కోర్ర మోతిలాల్ నాయక్ డిమాండ్ చేశారు. సంఘం 10వ వార్షికోత్సవ మహాసభ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. మోతిలాల్ మాట్లాడుతూ గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు తక్షణమే పట్టాలివ్వాలని, బంజారా భాష (గోర్ బోలి)ని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని అన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై తమ సంఘం ఆధ్వర్యంలో నిరంతరం పోరాటం చేస్తామని చెప్పారు. రాష్ట్ర అధ్యక్షుడు గాంధీనాయక్, డాక్టర్ రాజన్న, విద్యార్థి విభాగం అధ్యక్షుడు చందునాయక్, రవి నాయక్, సక్రీబాయి, గణేశ్‌నాయక్, నాగునాయక్, శాంతిబాయి, రాజేశ్‌నాయక్, దేవానాయక్, మోహన్‌నాయక్ పాల్గొన్నారు.